క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ప్రాగా టూల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్‌సీఎల్ గోదావరి, దుర్గ విహార్, ఆదిత్య విల్లాస్, కోణార్క్ ఆస్పత్రి, ప్రాగా టూల్స్, శాంతాశ్రీరామ్, జీఏల్ఆర్ ఎన్‌క్లేవ్, లక్ష్మి గంగా ప్రాంతాల్లో.. 11 కేవీ పైప్‌లైన్ రోడ్డు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీహెచ్ఈఎల్ విస్టా, ఆర్తీ కల్చర్, శ్వేత ఆర్యన్, ఆర్‌వీ నిర్మాన్స్, మారుతి సన్‌సిటీ, సుభాష్‌నగర్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి కట్ట మైసమ్మ జాతర


ఆలయంలో కొలువైన కట్టమైసమ్మ అమ్మవారు

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ రేణుక ఎల్లమ్మ ఆలయ జాతర శనివారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ పేర్కొంది. మొదటి రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, నవవర్ణ జప హోమం, సాయంత్రం సూరారం గ్రామం నుంచి అమ్మవారి ఊరేగింపు ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం


ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన భక్తులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బండారి లే అవుట్‌లో దక్షిణాభిముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం విజయ లక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చతుస్థానార్చనలు, వాస్తు హోమం, అమ్మవారి విగ్రహానికి పంచశయ్యాధి వాసముల్లో భాగంగా జలాధివాసము, క్షరాధివాసం, సాయంత్రం హిరణ్యాధివాసం, పుష్పాధివాసం కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్పొరేటర్ జ్యోతి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నరసింహరాజు, సెక్రటరీ రవీంద్రబాబు, ఆలయ కమిటీ సభ్యులు వెంకన్న, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వానం


ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు ఆహ్వానపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

దుండిగల్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో జగద్గిరిగుట్టకు చెందిన దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 12న జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో చేపట్టనున్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి


కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డితో సాయిఅనురాగ్ కాలనీవాసులు

నిజాంపేట్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వీరేందర్‌రెడ్డిని కలిశారు. కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులకు గాను ఆయనను కాలనీ వాసులు సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. సాయిఅనురాగ్ కాలనీ జనరల్ సెక్రటరీ భాషా, అసోసియేషన్ సభ్యులు కిరణ్, భాస్కర్, శివరామ్, రవీంద్ర, సాయిమిత్ర, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ సరే.. ఫ్రీ లెఫ్ట్‌కు స్థలమేది..?

- ఐడీపీఎల్ చౌరస్తాలో 15 అడుగుల మేర ఫుట్‌పాత్ విస్తరణ
- అవసరానికి మించి విస్తరించడంతో కుంచించుకుపోయిన ఫ్రీ లెఫ్ట్
- ట్రాఫిక్ కష్టాలు పెరుగుతాయంటున్న వాహనదారులు
- ఎమ్మెల్యే ఆదేశాలను సైతం పెడచెవిన పెడుతున్న జీహెచ్ఎంసీ అధికారులు



ఎమ్మెల్యే వివేకానంద్‌కు భవిష్యత్‌లో తలెత్తే ట్రాఫిక్ ఇబ్బందులను వివరిస్తున్న ట్రాఫిక్ ఉన్నతాధికారులు


ఐడీపీఎల్ జంక్షన్


ఫ్రీ లెఫ్ట్‌లో విస్తరించిన ఫుట్‌పాత్

రంగారెడ్డినగర్: ప్రధాన చౌరస్తాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు కొన్ని చోట్ల ట్రాఫిక్ విషయంలో కొత్త చిక్కులు తెచ్చి పెడుతున్నాయి. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టిన అయోధ్యనగర్, ఐడీపీఎల్ చౌరస్తా విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఫ్రీ లెఫ్ట్, ట్రాఫిక్ కష్టాలు తొలగించే ఉద్దేశంతో చేపట్టిన ఈ పనుల్లో ప్రణాళిక లోపించడంతో భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యను మరింత పెంచే విధంగా మారనున్నాయి. చౌరస్తాలో సదుపాయాలపై దృష్టిసారించిన అధికారులు రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా సజావుగా సాగేలా చూడడం మరిచారని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఫ్రీ లెఫ్ట్‌కు సరిపడా స్థలమేది..

జగద్గిరిగుట్ట రోడ్డు నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వెళ్లే మార్గంలో ఫ్రీ లెఫ్ట్‌కు సరిపడా స్థలం ఉన్నా ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే రోడ్డు వైపు మాత్రం అభివృద్ధి పనుల పేరుతో ఫ్రీ లెఫ్ట్‌పై అధికారులు దృష్టి సారించడం మరిచారు. దీంతో ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో జగద్గిరిగుట్ట వైపు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అవసరానికి మించి ఫుట్‌పాత్ విస్తరణ..

ప్రధాన రోడ్ల వెంబడి ఫుట్‌పాత్‌లను నాలుగైదు అడుగుల మేర బాటసారులు నడక సాగించేందుకు ఏర్పాటు చేస్తారు. అయితే నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ఐడీపీఎల్ జంక్షన్‌లో మాత్రం 15 అడుగులకు పైనే ఫుట్‌పాత్ నిర్మించారు. ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట వైపు వెళ్లే రోడ్డు ఎంత మేర వెడల్పు ఉందో దానికి సమానంగా స్థలాన్ని ఫుట్‌పాత్ ఆక్రమించింది. రోడ్డు విస్తరించకపోవడంతో భారీ వాహనాలు, ఇతర వాహనాలు ఒకేసారి వస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తే ఆస్కారముంది.

ఆదాయ మార్గాలపైనే దృష్టి..

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన చౌరస్తా, ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు ఆదాయ మార్గాలను పెంచుకోవడానికే అన్నట్లుగా తయారైంది. ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే రోడ్డులో ఫుట్‌పాత్‌లను విస్తరించిన ప్రాంతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భవిష్యత్‌లో షటర్ డబ్బాలను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. తద్వారా జీహెచ్ఎంసీకి రూ.2 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని అధికారులు భావిస్తున్నారు.

ట్రాఫిక్ అధికారుల విముఖత..

ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట వైపు ఫుట్‌పాత్‌ల విస్తరణ విషయంలో ట్రాఫిక్ అధికారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతం ఉండడంతో పాటు జగద్గిరిగుట్టకు సిటీ సర్వీసులు, వివిధ జిల్లాలకు చెందిన ఆర్టీసీ బస్సులతో పాటు భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో తీవ్ర రద్దీగా ఉంటుంది. భవిష్యత్‌లో మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశముందని, ఫ్రీ లెఫ్ట్‌కు సరిపడా స్థలం వదలకుండా చౌరస్తాను అభివృద్ధి చేస్తే భవిష్యత్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతాయని వారు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు..

ఐడీపీఎల్ చౌరస్తా అభివృద్ధిలో భాగంగా ఫుట్‌పాత్‌ల విస్తరణ విషయమై ట్రాఫిక్ అధికారులు ఎమ్మెల్యే వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లగా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులతో చర్చలు జరిపారు. ఫ్రీ లెఫ్ట్ స్థలాన్ని మరింత పెంచాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే వివేకానంద్ భవిష్యత్ ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జంక్షన్ అభివృద్ధి పనుల్లో మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం ఎలాంటి మార్పులు లేకుండానే పనులు చేస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో ఫ్రీ లెఫ్ట్ తీసుకునే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ఆస్కారముందని పలువురు చెబుతున్నారు.

మిస్టరీగా మారిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- ఆస్తి వివాదమే కారణమనే అనుమానాలు


మణికంఠ వర్మ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వనపర్తి: మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండలం ప్రగతినగర్‌లోని మధురానగర్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మణికంఠవర్మ (29) మృతి మిస్టరీగా మారింది. తన పెంపుడు కుక్కకు మందులు కొనేందుకు బుధవారం ఉదయం కారులో ఇంటి నుంచి బయలుదేరిన ఆయన వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం జానంపేట శివారులోని రామసముద్రం చెరువులో గురువారం శవమై తేలడం పలు అనుమానాలకు తావిస్తోంది. మృతుడి తల్లి విష్ణుప్రియ, అక్క అన్నపూర్ణదేవి కథనం ప్రకారం.. బుధవారం ఉదయం కుక్కపిల్లకు మందులు తీసుకువస్తానని మణికంఠవర్మ కారులో ఇంటి నుంచి బయలుదేరాడు. అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతడికి కాల్ చేయగా మొబైల్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో వారు అతడి స్నేహితులు, తమ బంధువులకు ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోవడంతో సాయంత్రం జేఎన్‌టీయూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వారు ప్రగతినగర్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి వస్తుందని చెప్పడంతో బాచుపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రామసముద్రం చెరువులో శవమై..

వనపర్తి జిల్లా, శ్రీరంగాపూర్ మండలం, జానంపేట శివారులోని రామసముద్రం చెరువులో తూము వద్ద శవం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డికి తెలియజేయగా.. ఆయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి షర్టు లేదు.. ట్రాక్ ప్యాంట్‌కు కారు తాళం చెవి కట్టి ఉంది. పోలీసులు తాళం చెవి తీసుకుని కారును ఓపెన్ చేసి చూడగా.. అందులో స్విచ్ ఆఫ్ అయిన సెల్‌ఫోన్ లభించింది. ఆన్‌చేసి ఓపెన్ చేసేందుకు ప్రయత్నం చేయగా లాక్‌వేసి ఉంది. పోలీసులు అందులోని సిమ్‌కార్డును తీసి మరో సెల్‌లో వేసి ఆన్ చేశారు. దీంతో అతడి మిత్రులు, బంధువులకు ఎస్ఎంఎస్ వచ్చింది. శివాజీ అనే వ్యక్తి వెంటనే కాల్ చేయగా.. కానిస్టేబుల్ విషయం చెప్పి రమ్మన్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులు గురువారం సాయంత్రానికి వనపర్తికి చేరుకున్నారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆస్తి వివాదమే కారణమా ?

కొన్నేళ్ల క్రితం గండిమైసమ్మ ప్రాంతంలో మృతుడి తండ్రి ఓ వెంచర్‌లో 340 గజాల ప్లాటు కొనుగోలు చేశాడు. దీని పక్కనే మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ భవన్‌ను నిర్మించారు. దాని పార్కింగ్ కోసం ఆ పార్టీ నేతలు వెంచర్‌లోని ప్లాట్లను చదును చేసేందుకు యత్నించారు. దీంతో మణికంఠవర్మ, తనతో పాటు కొనుగోలు చేసిన వారితో కలిసి కోర్టులో కేసు వేశారు. కోర్టు స్టే ఇవ్వగా.. తహసీల్దార్ స్వయంగా వచ్చి చదును చేసే పనులను నిలిపివేయించారు. ఈ క్రమంలో మణికంఠవర్మ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆస్తి వివాదమే ప్రాణం తీసిందని.. ఈ వివాదం తప్ప తమకు ఎలాంటి సమస్యలు లేవని మృతుడి తల్లి, అక్క రోదిస్తూ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

'ఎన్నికల్లో అధికార పార్టీకి గుణపాఠం చెప్పండి'

జీడిమెట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం సుభాష్‌నగర్, గంపల బస్తీ, రామిరెడ్డినగర్ ప్రాంతాల్లో హన్మంతరెడ్డి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ద్వంద్వ నీతిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గడప గడపకు హాత్ సే హాత్ జోడో స్టిక్కర్లను అతికించి కాంగ్రెస్ పార్టీని బలపరచాలని కోరారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలతో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి తొమిదేళ్లు కావస్తున్నా నేటికీ నిరుద్యోగులకు భృతిని ఇవ్వడం లేదని, కుటుంబానికి ఒక ఉద్యోగం అని చెప్పి కేసీఆర్ కుటుంబం లబ్ధి పొందిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్‌కుమార్, ఆవీజే జేమ్స్, సామ్మనగారి శ్రీధర్ రెడ్డి, సంగం వీరేష్, గుత్తా గురువారెడ్డి, రాంచందర్, హేమరాణి, సుల్తానాబేగం, పండరిరావు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పాలనలో ప్రజలు మోసపోయారు'


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు అన్ని విధాలుగా మోసపోయారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని ద్వారకానగర్‌లో బీజేపీ శక్తి కేంద్రాల సభ్యులతో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. మహిళలను వడ్డీ లేని రుణాల పేరిట, యువతను నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేయడంతో పాటు అధిక విద్యుత్ చార్జీలు వసూలు చేస్తూ రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ మోసపూరిత మాటలను నమ్మేస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. శక్తి కేంద్రాలు బూత్‌ల వారీగా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, రాజేశ్వర్‌రావు, నాయకులు నటరాజ్‌గౌడ్, గడ్డం రాజేందర్‌రెడ్డి, రాజేష్ మిశ్రా, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శుక్రవారం మల్లంపేట్‌లోని 26వ వార్డులో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలతో పాటు చేపట్టబోయే అభివృద్ధి పనులపై కాలనీల అసోసియేషన్ సభ్యులతో చర్చించారు. రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు చేసిన అనంతరం కృష్ణ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తానని, ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తానన్నారు. కాలనీవాసులు నరేందర్, మురళి, ప్రకాష్, వెంకట్, శివ, సుబ్రహ్మణ్యం, నరేంద్ర, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

అభినందన



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బొజ్జ ప్రణయ్ ఫిబ్రవరి 27న తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. దీంతో శుక్రవారం ప్రణయ్‌ని యూనివర్సిటీ కళాశాల విభాగాధిపతులు ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ అంజిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

జీడిమెట్ల: హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించారు. సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్‌కు ధరణి ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె కాలేజ్ ఫీజు చెల్లించేందుకు హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్ సహకారంతో శుక్రవారం రూ.4,100 చెక్కును ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్ అందజేశారు.

బచ్‌పన్ పాఠశాల 20వ వార్షికోత్సవం


కేక్ కట్ చేసిన స్కూల్ డైరెక్టర్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ స్కూల్ 20వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శివోత్సవాలు

మియాపూర్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వెంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో శ్రీ భవానీ శంకరాలయం త్రయోవింశ శివోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సామూహిక లక్ష కుంకుమార్చన, నిత్యహోమం చేశారు. చుట్టపక్కల కాలనీల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా 'హాత్ సే హాత్ జోడో' యాత్ర


దిల్‌కుష్‌నగర్‌లో యాత్ర నిర్వహిస్తున్న సత్యం శ్రీరంగం తదితరులు

బాలానగర్: పీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో జరుగుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర శుక్రవారం దిల్‌కుష్‌నగర్‌లో 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ రాహుల్ గాంధీ సందేశాన్ని కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గూడ ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. గడప గడపకు వెళ్లి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అక్రమాలు, వారు ఇచ్చిన హామీలు, అన్ని వర్గాల ప్రజలకు చేసిన మోసాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టే పనుల గురించి ప్రజలకు చెప్తున్నామని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్‌కుష్‌నగర్‌లో జరిగిన ప్రతి అభివృద్ధి పనిలో కాంగ్రెస్ పార్టీకి భాగస్వామ్యం ఉందన్నారు. ఇంటింటి పాదయాత్రలో అనేక మంది పింఛన్లు, నిరుద్యోగ భృతి గురించి అడుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, సీనియర్ నాయకులు శామ్యూల్, నల్లోల రాజేందర్, క్రిష్టారాజ్‌పుత్, మట్టే ప్రసన్నకుమార్, బాలాపీర్, నవాబ్, షాజీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

పల్టీ కొట్టిన కారు.. తప్పిన ప్రమాదం

కేపీహెచ్‌బీకాలనీ: వేగంగా వెళ్తున్న కారు ముందు టైర్ పేలడంతో అదుపుతప్పి డివైడర్ ఎక్కి పల్టీ కొట్టిన ఘటన శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అయితే అదృష్టవశాత్తూ కారులో ఉన్న ఇద్దరికీ ఎలాంటి గాయాలు కాలేదు. మణికొండకు చెందిన ఎం.వి.కిషోర్ కుమారుడు సాయితో కలిసి కేపీహెచ్‌బీ కాలనీ నుంచి ఫోర్త్ ఫేజ్ మీదుగా మూసాపేట వైపు వెళ్తున్నాడు. లోథా అపార్టుమెంట్స్ వద్దకు రాగానే కారు ముందు టైర్ పేలిపోయింది. దీంతో అదుపుతప్పిన కారు రోడ్డు డివైడర్ ఎక్కి పల్టీ కొట్టింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు కారులో ఉన్న కిషోర్, సాయిని బయటకు తీశారు. వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కారును రోడ్డుకు అడ్డుగా లేకుండా పక్కకు తీశారు. టైర్ పేలిపోవడంతోనే కారు పల్టీ కొట్టినట్లు గుర్తించారు.

విక్రమాదిత్య నాటక ప్రదర్శనోత్సవాలు ప్రారంభం


కార్యక్రమానికి హాజరైన అతిథులు


నాటక ప్రదర్శన దృశ్యం

చింతల్: రాజా విక్రమాదిత్య గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకే మహా నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మధ్యప్రదేశ్ విద్యాశాఖ మంత్రి మోహన్యాదవ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల హెచ్ఎంటీ మైదానంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగే రాజా విక్రమాదిత్య ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జ్యోతి ప్రజ్వలన చేసి తొలి రోజు మహా నాటక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా మధ్యప్రదేశ్ సాంస్కృతిక శాఖ సహకారంతో జరిగే ప్రదర్శన సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మొబైల్ సందేశాన్ని వినిపించి తాను రాలేకపోయినందుకు చింతిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై 150 మంది మధ్యప్రదేశ్ కళాకారులచే నిర్వహించిన నాటక ప్రదర్శనను వీక్షించారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, జాతీయ నాయకుడు మురళీధర్‌రావ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు డా.ఎస్ మల్లారెడ్డి, శాంతికుమార్, జిల్లా అధ్యక్షులు పన్నాల హరీశ్‌రెడ్డి, విక్రమ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో 'రీ ఆర్గనైజింగ్ ది మెంటల్ స్పేస్' అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ బి.కె. రామకృష్ణ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు


పోలీస్ అధికారులతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి (ఫైల్)


ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

నిజాంపేట్: ప్రజాప్రతినిధిగా అభివృద్ధి పనులు చేపడుతూనే సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని తన వార్డులో ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులను సైతం వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు.

- 18వ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ప్రజల వ్యక్తిగత అవసరాల కోసం షెడ్లను ఏర్పాటు చేశారు. కావ్యశ్రీ హోమ్స్, సాయిఅనురాగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో సొంత నిధులతో షెడ్లు ఏర్పాటు చేసి గణపతి, దుర్గా నవరాత్రోత్సవాలతో పాటు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వినియోగిస్తున్నారు.
- సొంత ఖర్చులతో స్థానిక యువత కోసం లైబ్రరీ ఏర్పాటు చేయడంతో పాటు కల్యాణ మండపంలో వధూవరులకు విడివిడిగా గదులు నిర్మించారు.
- యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేయడంతో పాటు క్రీడలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు.
- డివిజన్ పరిధిలో ఉన్న పార్కుల్లో వృద్ధులు, మహిళలు కూర్చునేందుకు తన తండ్రి పద్మారెడ్డి జ్ఞాపకార్థం బెంచీలు ఏర్పాటు చేయించారు.
- యువత కోసం ఓక్‌లేన్ కాలనీలో జిమ్ ఏర్పాటు చేసి వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు.
- కరోనా కష్టకాలంలో స్థానికులు, వలస కార్మికులను అన్ని విధాలుగా ఆదుకున్నారు. వారికి ఆహారం అందించడంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ప్రజలకు సొంత ఖర్చులతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- డివిజన్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు చెక్కు అందజేశారు.

పేదలను ఆదుకునేందుకే..

తనను ఎన్నుకున్న ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే తపన ఉంది. ప్రభుత్వ నిధులతో ఇప్పటికే డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, తాగునీటి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చా. పేదలను ఆదుకునేందుకు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నా.

– కొలన్ వీరేందర్‌రెడ్డి, కార్పొరేటర్